ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నిధుల్లేవ్..!

అధ్వానంగా రైతు వేదికలు

- జిల్లాలో 82 కార్యాలయాలను ఏర్పాటు చేసిన గత సర్కార్
- భారంగా మారిన నిర్వహణ
- ఏడాదికి పైగా ప్రభుత్వం నుంచి రాని డబ్బులు
- ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు
- సాగులో కర్షకులకు కరువైన సూచనలు, సలహాలు



తాళంవేసి ఉన్న తొర్రూరు క్లస్టర్ రైతు వేదిక

తొర్రూరు, జనవరి 5 : సాగులో కర్షకులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన రైతు వేదికలు అధ్వానంగా మారాయి. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా, వ్యవసాయంలో నిపుణుల ద్వారా సమాచారం అందించానికి వాటిని నిర్మించినా ప్రయోజనం లేకుండాపోయింది. నిధులు లేక అధ్వానంగా తయారయ్యాయి. వీటి నిర్వహణ కొరవడి రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఏర్పాటు..

అన్నదాతలకు నిరంతరం సమావేశాలు, పంటల సాగులో కొత్త విధానాలతో పాటు అధికారుల సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు వీలుగా రైతువేదికలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో వ్యవసాయ క్లస్టర్‌ల వారిగా 82 రైతు వేదికలు నిర్మించింది. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అందుబాటులో ఉండే విధంగా వసతులు కల్పించారు. ఇందులో ప్రత్యేకంగా ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైక్‌సెట్ వంటివి కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ నిధులతో రైతుల తోడ్పాటులో కొన్నిచోట్ల అవసరమైన వసతులను కూడా సమకూర్చారు. వీటిల్లో సీజనల్ వారిగా పంటల సాగుపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా ఇచ్చేవారు. ఇటీవల జరిగిన దశాబ్ది వేడుకల్లో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాల గురించి తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా..

వ్యవసాయశాఖకు పనులు లేనప్పుడు వీటిని ఇతర శాఖల అధికారులు కూడా వినియోగించుకుంటున్నారు. రైతు సమితి అధ్యక్షుడి భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అయితే వీటి నిర్వహణకు గత ఏడాది కాలంగా నిధులు విడుదల కాకపోవడంతో ఆలనాపాలన కష్టంగా మారింది. తొలుత ఒక్కో రైతు వేదిక నిర్వహణకు రూ.9 వేలు అందించారు. జిల్లాలో చాలాచోట్ల నిర్మించిన రైతు వేదికల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోవడం వల్ల అలంకార ప్రాయంగా మారిపోయాయి. కొన్నిచోట్ల రైతు వేదికలు మందుబాబులకు అడ్డాలుగా మారడంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తెలంగాణరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతు వేదిక నిర్వహణపై కొత్త మార్గదర్శకాలు వస్తాయా? లేక ఉన్నవాటినే కొనసాగిస్తారా! అనే వాటిపై స్పష్టత లేదు. ప్రస్తుతానికి ఈ వేదికల నిర్వహణ కష్టంగా మారింది.

యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో...

ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ఏఈవోలు గ్రామాలకు వచ్చినపుడు పంచాయతీ కార్యాలయాలు వినియోగించుకునేవారు. 5 వేల రైతులకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, రైతు వేదిక నిర్మించడం వల్ల వాటిని వ్యవసాయ శాఖ క్లస్టర్ కార్యాలయాలుగా ఉపయోగించుకుంటున్నారు. దీనివల్ల వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంటున్నారు. వాటి నిర్వహణకు సంబంధించి నెలనెలా ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకపోవడంతో ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. స్వీపర్ వేతనాలు, తాగునీరు, తదితర అవసరాలకు ఇబ్బందులు ఉన్నాయి.

అయితే రైతు వేదిక నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం రూ.9,500 అందించేంది. వాటిలో రూ.3000 స్వీపర్‌కు రూ.1000 విద్యుత్ బిల్లు, స్టేషనరీ, తాగునీటికి రూ.2000, శిక్షణ నిర్వహణకు రూ.2500 వినియోగించేవారు. 2022 ఆగస్టు వరకు ప్రతీనెల నిధులు అందాయి. గత సెప్టెంబరు నుంచి నిధులు అందకపోవడంతో ఆయా క్లస్టర్ వ్యవసాయాధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతు వేదికల నిర్వహణకు డబ్బులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతు వేదికలను కొనసాగించాలి.. : ఎడ్డెబోయిన సోమయ్య, రైతు తొర్రూరు



రైతుల సమస్యలు, సలహాలు, సూచనల కోసం ఏర్పాటు చేసిన రైతు వేదికలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి. ఆయా సీజన్లలో అధికారుల సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. క్లస్టర్ వారిగా ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో రైతులందరు ఒకేచోట చేరి,సమస్యలతో పాటు ఒకరికొకరు సలహాలు తీసుకునేందుకు వీలుగా ఉంటుంది. రైతువేదికల నిర్వహణ అధికారులకు కష్టంగా మారింది. ప్రభుత్వం చొరవచూపి రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేసి కొనసాగించాలి

ప్రతిపాదనలు పంపించాం..



శోభన్‌బాబు, వ్యవసాయ డివిజన్ విస్తరణ అధికారి

గత కొన్నినెలలుగా రైతు వేదికలకు నిధులు రాకపోవడంతో ఏఈవోలు పడరాని పాట్లు పడుతున్నారు. పరిశుభ్రత, శిక్షణ స్టేషనరీ, వాచ్‌మెన్, విద్యుత్ చార్జీలు, మరమ్మతులకు నిధులు ఇవ్వక పోవడంతో సౌకర్యాలు ఉండటం లేదు. గతంలో రైతుబంధు అధ్యక్షులు రైతులు, వ్యవసాయాధికారులు సమావేశాలు ఏర్పాటు చేసుకునే వారు. నిర్వహణ భారంగా మారడంతో సమావేశాలు జరుపుడం లేదు. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం మండల రైతు సమన్వయ సమితీలను రద్దు చేసింది. నూతనంగా ఏదైనా విధానం తీసుకువచ్చి మార్గదర్శకాలు తీసుకువస్తే వాటిని అమలు చేస్తాం. ప్రస్తుతం రైతు వేదికల నిర్వహణకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. వీటి నిర్వహణ ఏఈవోలకు భారంగా మారుతుంది.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటా

మంత్రినైనా మీ బిడ్డనే..

- సీతక్కకు స్వగ్రామంలో ఘన స్వాగతం
- పూలదండలు, శాలువాలతో సన్మానించిన జగ్గన్నపేట వాసులు

ములుగు, జనవరి 5 : తనకు జన్మనిచ్చి ఎదుగుదలకు ఊతమిచ్చిన జగ్గన్నపేట గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శుక్రవారం ములుగు మండలంలోని స్వగ్రామానికి వెళ్లారు. అభిమాన నాయకురాలికి గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. ఆరాధ్య దైవమైన పుట్టమల్లన్నను దర్శించుకున్న సీతక్క నేరుగా తన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు సమ్మక్క-సమ్మయ్యల ఆశీర్వాదం తీసుకున్నారు. తన సోదరుడు సాంబయ్య సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో సీతక్క పాల్గొన్నారు. పూలమాలలు శాలువాలతో సీతక్కను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. చిన్ననాటి స్నేహితులు, ఆత్మీయులను సీతక్క పలకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను మంత్రిగా ఎదిగినా ఎప్పుడూ మీ ఆడబిడ్డనేనని అన్నారు. మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా జగ్గన్నపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ములుగు నియోజకవర్గాన్ని ప్రగతిలో ముందువరుసలో నిలబెడతానని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతీ అర్హుడికి చేరువచేస్తానని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానని, అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కూచన రవళిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, పార్టీ ములుగు మండల అధ్యక్షుడు చాంద్‌పాషా పాల్గొన్నారు.

రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులు

త్వరగా పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం
- మేడారం జాతర ఏర్పాట్ల పరిశీలన

మేడారం, జనవరి 5: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర కోసం చేపట్టిన రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులను ఫిబ్రవరి 1వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం పరిసరాల్లో కొనసాగుతున్న పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. పస్రా-మేడారం, మేడారం-భూపాలపల్లి, తాడ్వాయి-మేడారం రూట్లలో చేపట్టిన రోడ్ల మరమ్మతులను స్వయంగా పరిశీలించారు. ఆయాచోట్ల ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలు, చిలుకలగుట్ట, జంపన్నవాగు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జంపన్నవాగుపై ఊరట్టం వద్ద నిర్మిస్తున్న కాజ్‌వే పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

మేడారం, ఊరట్టంలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో జాతర విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ఏపీవో వసంతరావు, ఈఈ ప్రేమలత, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఆయా ఇంజనీరింగ్ శాఖల డీఈలు రఘువీర్, చందర్, రవీందర్, స్టాటిస్టిక్ అధికారి రాజ్‌కుమార్ ఉన్నారు.

కేయూలో కలకలం

- ఏసీబీ వలలో ఆడిట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య
- పాల బిల్లులు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన కాంట్రాక్టర్
- రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత





ఏఆర్ కిష్టయ్యను విచారిస్తున్న ఏసీబీ అధికారులు, ఏసీబీకి పట్టుబడిన కిష్టయ్య

హనుమకొండ క్రైం/కేయూ క్యాంపస్, జనవరి 5 : కాకతీయ యూనివర్సిటీలోని ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సిగసారపు కిష్టయ్య ఓ పాల కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. శుక్రవారం ఉదయం 12గంటలకు కేయూలో పెండెం రాజేందర్ అనే వ్యక్తి నుంచి లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన పెండెం రాజేందర్ 15 ఏళ్లుగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న మహిళలు, పురుషుల హాస్టళ్లలో పాలు, పెరుగు సరఫరా చేస్తున్నాడు. ఇందుకు ప్రతీనెల కేయూ ఆడిట్ విభాగం నుంచి వచ్చే డబ్బులను తీసుకుంటాడు. ఈ క్రమంలో రెండేళ్లకుగానూ రూ.15లక్షల బిల్లులు రావాల్సి ఉంది. దీని కోసం రాజేందర్ పలుమార్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను కలిసి తనకు రావాల్సిన బిల్లులు ఇవ్వాలని కోరారు. అయినా కిష్టయ్య వినిపించుకోలేదు. బిల్లులు మంజూరు చేయాలంటే మొత్తంగా రూ.75 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో చేసేదేమీలేక రాజేందర్ ఒకసారి రూ.15 వేలు, మరోసారి రూ.10వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. రెండు విడతల్లో రూ.25 వేలు ఇస్తానని, తర్వాత రూ.50వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఇద్దరి ఒప్పందం ప్రకారం గతనెల రెండుసార్లు ఆన్‌లైన్‌లో రూ.25వేలు పంపించగా రూ.8 లక్షల చెక్కును అప్పగించాడు. మిగతా రూ.7లక్షలకు రూ.50వేలు ముందుగానే ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు.

ఈ క్రమంలో రాజేందర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సలహా మేరకు రూ.50 వేలతో శుక్రవారం కేయూకు వెళ్లాడు. పరిపాలన విభాగం ఆడిట్ కార్యాలయంలో తెచ్చిన డబ్బును కిష్టయ్యకు అందించాడు. ఇంకేముంది.. అక్కడే మాటువేసి ఉన్న అవినీతి నిరోధక శాఖ అధికారులు మూకుమ్మడిగాదాడిచేశారు. నగదును స్వాధీనం చేసుకుని వారు అప్పటికే తెచ్చిన రసాయనాలలో పరీక్షించారు. నగదును స్వాధీనం చేసుకుని కిష్టయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. విచారణ అనంతరంఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడులలో అవినీతి నిరోధక శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, కె.శ్రీనివాస్, నీలం రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

10 శాతం ఇస్తే బిల్లు చేస్తానన్నాడు : బాధితుడు రాజేందర్

పాలు, పెరుగు బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగాను. రూ.15 లక్షల బిల్లులు చేయాలని అడిగితే 10 శాతం కావాలని డిమాండ్ చేశాడు. బతిమిలాడితే రూ.75 వేలు ఒప్పుకున్నాడు. ముందుగా రూ.25 వేలు ఇచ్చాను. కొంత బిల్లు చేశాడు. మిగతా డబ్బులకు తీవ్ర ఇబ్బందికి గురి చేశాడు. చివరికి కాళ్ల బేరానికి వెళ్లాను. కనికరించకుండా డబ్బులు డిమాండ్ చేశారు. దిక్కు తోచని స్థితిలో ఏసీబీని ఆశ్రయించాను.

కలెక్టర్‌గా అద్వైత్‌కుమార్ సింగ్ బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన అద్వైత్‌కుమార్‌సింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 26 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేయగా, ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న శశాంక రంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కేంద్రసర్వీసులో డిప్యూటేషన్‌లో పని చేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్ కలెక్టర్‌గా బదిలీ కాగా, శుక్రవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఏవో వెంకటరమణ, జడ్పీ సీఈవో రమాదేవి, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, వివిధస్థాయి అధికారులు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, నేతలు మైస రోహిత్, దైద ఉషారాణి, సోమని, రంజిత్, సురేష్, వెంకటేశ్వర్లు, వీరునాయక్ పుష్పగుచ్ఛాలందించి, శుభాకాంక్షలు తెలిపారు.

- మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామ సర్పంచ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్, ఉపాధ్యక్షుడు భూక్య బాలాజీనాయక్, ధరావత్ హతిరాంనాయక్ కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మహబూబాబాద్‌లో కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

'దరఖాస్తుల వివరాలను త్వరితగతిన అందించాలి'

ప్రజాపాలన రోజువారీ దరఖాస్తుల వివరాలను త్వరితగతిన అందించాలని కొత్త కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజాపాలన కార్యక్రమ అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 1.98 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణ తీరును వేగవంతం చేసి, నివేదికలు కూడి ఆదేరీతిలో అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు రమాదేవి, సుబ్బారావు, సన్యాసయ్య, నోడల్ అధికారులు సూర్యనారాయణ, సుధాకర్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, మునిసిపల్ కమిషనర్లు ప్రసన్నారాణి పాల్గొన్నారు.

పూర్తి అవగాహనతో 'ఆన్‌లైన్' చేయాలి..

ప్రజాపాలన దరఖాస్తులను ముందుగా ఒకసారి చదివి, పూర్తి అవగాహనతో ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో అభయ హస్తం పథకం కింద స్వీకరిస్తున్న దరఖాస్తులను 'ఆన్ లైన్' చేపట్టేందుకు మాస్టర్‌ట్రైనర్స్‌చే 250 మంది ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులపై ఏమైనా అనుమానాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్‌చే నివృత్తి చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు నెంబరు వస్తుందని ఆ నెంబర్ దరఖాస్తుపై నమోదు చేయాలని, దరఖాస్తులో సూచించిన సెల్ నెంబరుకు కూడా సమాచారం వస్తుందన్నారు. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తు ఆన్‌లైన్ అయిన తర్వాత ఏ దశలో ఉందో praja-palana.telangana.gov.in పోర్టల్‌లో తమ సెల్‌కు వచ్చిన మెసేజ్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. దరఖాస్తు దారుడు పొందుపర్చిన వివరాలనే ఆన్‌లైన్‌లో పొందు పర్చాలని ఎట్టి పరిస్థితుల్లో మార్పులు, చేర్పులు చేయవద్దన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి5 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలం ఉత్తరతండా, నడివాడలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలు కోసమే ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. గత బీఆర్‌ఎస్ అరాచక పాలననుంచి విముక్తి కలిగించేందుకే తిరిగి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చారని చెప్పారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రకటించినవి 420 హామీలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచులు అంగోతు కాంతికిషన్‌నాయక్, పెదగాని నర్మదగుట్టయ్య, ఎంపీటీసీలు మంగీలాల్, రాయపాటి శ్రీపాల్‌రెడ్డి, డీపీవో హరిప్రసాద్, నోడల్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీవో హరిప్రసాద్, చాంప్లానాయక్, గోపిసింగ్, రాయపాటి బుచ్చిరెడ్డి, మల్లేశం, కిరణ్‌రెడ్డి, మైదం ప్రసాద్, లింగ్యా, ఎల్లయ్య, శ్రీను, మల్లయ్య మల్లారెడ్డి పాల్గొన్నారు.

- గూడూరు : ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కొల్లాపురం, బొల్లెపల్లి, తీగలవేణిలలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన పాల్గొని, దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికి రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఏవో అల్లె రాకేష్, సర్పంచులు సుధాకర్‌రావు, సునిత, వేం శైలజామోహన్‌రెడ్డి, ఎంపీటీసీ వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు అర్రెం వీరస్వామి, కొమ్మాలు, మధు, గట్టుమల్లు పాల్గొన్నారు.



నడివాడలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

ఇనుగుర్తి, జనవరి 5 : పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సూచించారు. చిన్నముప్పారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాదిలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. మెరుగైన ఫలితాల కోసం కాంప్లెక్స్‌లోని ఇతర ఉపాధ్యాయులను అవసరమైన చోట, వారి సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. తర్వాత పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాందాస్, శ్రీరాములు, రమేష్, కుమారస్వామి, సత్యనారాయణ, సోమయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఉన్మాదం

- కన్నతల్లిని రోకలితో కొట్టి చంపిన కొడుకు
- అడ్డువచ్చిన మరో మహిళపైనా దాడి
- సైకో తీరుతో వణికిపోయిన తిరుమలగిరి గ్రామస్థులు
- భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఘటన

8

ఆస్తి తగాదాలతో తండ్రిని చంపిన కుమారుడు

- గూడూరు మండలం తీగలవేణిలో ఘటన

వివరాలు 7లో..

రక్తహీనత పిల్లలను గుర్తించాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అంబరీష



సమావేశంలో మాట్లాడుతున్న అంబరీష

నెహ్రూసెంటర్, జనవరి5 : జిల్లా వ్యాప్తంగా 8 నుంచి 12 సంవత్సరాల్లోపు రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించాలని డీఎంహెచ్‌వో అంబరీష సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డీఎం అండ్‌హెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలు రోగాల బారిన పడకుండా వైద్యాధికారులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. పుట్టుకతో ఉన్న రుగ్మతలను, ఇతర జబ్బులను త్వరగా గుర్తించి మందులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, మురళీధర్, నాగేశ్వర్ రావు, సుధీర్‌రెడ్డి, వడ్డెబోయిన శ్రీనివాస్, కెవి.రాజు, డీపీవో రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

పల్లె దవాఖాన సిబ్బందిపై ఆగ్రహం

తొర్రూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, సమయం పాటించని వారిపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో ఎ.అంబరీష హెచ్చరించారు. తొర్రూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజూ రోగులసేవలు, మందుల వినియోగం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది హాజరు వివరాలు పరిశీలించి, సమీక్ష నిర్వహించారు. పల్లె దవాఖానాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు సమయపాలన పాటించడం లేదని, దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. పల్లె దవాఖానాల్లో వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీలను నియమించిందని, వారు స్థానికంగా ఉండిసేవలు అందించాలన్నారు. వైద్యులు మురళీధర్, జ్యులిత, ప్రియాంక, నందన, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్యను పెంచాలి..

నర్సింహులపేట : ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్యను పెంచి, సామాన్య ప్రజలకు వైద్యం జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో అంబరీష వైద్య సిబ్బందిని ఆదేశించారు. నర్సింహులపేట మండలకేంద్రం, కౌసల్య దేవిపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 9ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయని, ప్రసవాల సంఖ్యను పెంచేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలను అవగాహన కల్పించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఎల్‌హెచ్‌పీలు అంజలి, అన్వేష్, హెల్త్ అసిస్టెంట్ మిట్టకోల సత్యనారాయణ, ఆశా వర్కర్లు ఉన్నారు.

తండ్రిని రాయితో కొట్టి చంపిన కొడుకు


మృతిచెందిన కందళం లింగాచారి

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 5 : ఆస్తి తగదాల విషయంలో తండ్రిని కుమారుడు రాయితో కొట్టి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణిలో శుక్రవారం చోటు చేసుకుంది. గూడూరు ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగలవేణి గ్రామానికి చెందిన కందళం దేవేంద్రమ్మ-లింగాచారి (70) దంపతులకు బ్రహ్మచారి, కృష్ణ, రమేష్ సంతానం. లింగాచారికి ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. ముగ్గురు కుమారులకు సమానంగా ఆ భూమిని పంచి, ఇచ్చాడు. లింగాచారిలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. చిన్నకుమారుడు రమేష్ ఏం పనిచేయకుండా మద్యానికి బానిసై తండ్రి, సోదరులతో తరుచూ గొడవ పడుతుండేవాడు. మద్యం సేవించి వచ్చిన రమేష్ మద్యం మత్తులో లింగాచారి నిద్రిస్తుండగా రాయితో కొట్టి, చంపాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బ్రహ్మచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

నేడు, రేపు బ్రహ్మకుమారిల స్వర్ణోత్సవాలు

సుబేదారి, జనవరి 5: వరంగల్ కేంద్రంగా ఆధ్యాత్మిక సేవలు ప్రారంభించి 50 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా శని, ఆదివారం రెండు రోజుల పాటు బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్డులోని డి-కన్వెన్షన్ హాల్‌లో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. డి-కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు హాజరవుతారని అలాగే ఉమ్మడి జిల్లాలో ఉన్న 12 నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. శనివారం ఉదయం అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఒక కొత్త ఆరంభానికి సాకారాత్మక పరివర్తన అంశంపై ఆధ్యాత్మిక కార్యక్రమం, సాయంత్రం 4:30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుతో ఆరోగ్య ప్రసంగం, సామూహిక రాజయోగ ధ్యానం అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. 7వ తేదీ ఉదయం 6:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చే సుమారు 4 వేల మంది బ్రహ్మకుమారీల సభ్యులతో ఆధ్యాత్మిక సమావేశం, సేవలు అందించిన వారికి సత్కారాలు ఉంటాయని తెలిపారు.

పాలిటెక్నిక్ రెండో సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుబేదారి, జనవరి 5: ఐటీఐలో రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్‌లో రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ(బాలుర) ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జుమ్లా నాయక్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బీకామ్ విద్యార్థులకు 3 మార్కులు

కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ బీకామ్ మూడో ఏడాది ఐదో సెమిస్టర్ ప్రశ్నపత్రం ఈ-కామర్స్ సబ్జెక్టులో ఒకే ప్రశ్న రెండుదఫాలుగా వచ్చిన అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలికితీసిన నేపథ్యంలో వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు స్పందించారు. డిగ్రీ ఈ- కామర్స్ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరికీ తప్పుడు ప్రశ్నకు అదనంగా 3 మార్కులను కేటాయిస్తామని ప్రకటించారు. జరిగిన తప్పిదంపై సంబంధిత అధికారులపై చర్యలుంటాయని తెలిపారు.

గురుకులంలో ప్రవేశ పరీక్ష

హనుమకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : దేవన్న పేట ప్రభుత్వ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాలకు ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు టీటీడబ్ల్యుయూఆర్‌జెసీ (బాలిక లు) హనుమకొండ ప్రిన్సిపాల్ ఆర్.విమల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిద్యా సంవత్సరంలో (2023-24) 4వ తరగతి చదువుతున్న అర్హులైన వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ (ఆర్ఎస్) కింద ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంతా ఆయనే..

హాస్టల్స్ బిల్లుల చెల్లింపుల్లో ఎ.ఆర్. కిష్టయ్యపై పలు ఆరోపణలు

ఏసీబీ ట్రాప్‌తో బెంబేలెత్తుతున్న కేయూ ఉద్యోగులు

గతంలో పరీక్షల విభాగంపై పోలీసుల విచారణ

కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీలో ఏసీబీ దాడులతో అవినీతి ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వర్సిటీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో శుక్రవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్టయ్య పట్టుకోవడంతో వర్సిటీలో కలకలం రేగింది. గతంలో పరీక్షల విభాగంలో సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. దీంతో అప్పటి కాజీపేట ఏసీపీ కోయ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక విచారణ అధికారిగా నియమించి సర్టిఫికెట్ల జారీ, పరీక్షల విభాగంలో చోటు చేసుకున్న అక్రమాల దందాలను బయటికి తీశారు. తర్వాత అప్పటి పరీక్షల నియంత్రణాధికారులపై కేసులు నమోదు చేసిన విచారణ చేపట్టారు. అయితే అప్పటి కేసు అతీగతి లేకుండా పక్కన పెట్టారు. ఇదిలా ఉండగా, వర్సిటీలో తాజాగా పి.రాజేందర్ అనే పాలు, పెరుగు కాంట్రాక్టర్ ఫిర్యాదుతో ఏసీబీ పోలీసులు వలపన్ని కిష్టయ్యను పట్టుకున్నారు.

ఆది నుంచి వివాదాస్పదుడే..

ఏఆర్ కిష్టయ్య ఆది నుంచి వివాదాస్పదుడనే ఆరోపణలున్నాయి. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో ఎక్కువ కాలం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. అక్కడ పలు అక్రమాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులు రావడంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు అప్పటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్లతో విచారణ కమిటీని నియమించారు. అయితే విచారణ కమిటీ ఇప్పటి వరకు రిపోర్టు ఇవ్వలేదు.



అవినీతి ఆరోపణలపై కమిటీ విచారణను ఎదుర్కొంటున్న కిష్టయ్యను వర్సిటీలోని కీలకమైన పదవిలో నియమించి అవినీతికి ఊతం ఇచ్చారనే చర్చలు జరుగుగుతున్నాయి. ఈయన హాస్టల్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, అడిట్ అధికారిగా రెండు పదవుల్లో కొనసాగుతున్నారు. హాస్టల్స్ కార్యాలయంలో బిల్లులను స్వయంగా తయారు చేసి, అయనే చెల్లించే వెలుసుబాటు ఉంది. అందుకే కాంట్రాక్టర్లను డబ్బులు అడిగారనే ఆరోపణలున్నాయి. ఒకే అధికారి బిల్లు రూపొందించే పదవిలో కొనసాగుతూ అదే బిల్లును చెల్లింపు చేసే అధికారం కల్పించడంతోనే అవినీతికి బీజం పడిందని తెలుస్తోంది.

ఫోన్ రికార్డులు లీక్

ఏబీసీ అధికారులకు చిక్కిన కేయూ అడిట్ ఆఫీసర్ కిష్టయ్య కాంట్రాక్టర్ పి.రాజేందర్‌తో జరిపిన ఫోన్ రికార్డులు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. కాంట్రాక్టర్ రాజేందర్‌తో పాటు ఇతర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల నుంచి లంచాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారులకు కిష్టయ్య బాధితుడు ఫోన్ రికార్డులను కూడా అందచేశారు.

వర్సిటీ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు

వర్సిటీలో కొందరు ఉద్యోగుల అవినీతికి అడ్డూ అదుపూ లేదు. నేరుగా కళాశాలల అధికారులు డబ్బులు వసూలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చే కళాశాలల ప్రిన్సిపాల్‌తోపాటు ప్రయివేటు కళాశాలల యాజమాన్యాల నుంచి విచ్చలవిడిగా లంచాలు తింటున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బులు చెల్లించని కళాశాలలకు నిబంధనల పేరుతో అనుమతులను అపేస్తారనే అపవాదులున్నాయి డబ్బులిస్తే అన్ని ఆల్‌రైట్ అనే చర్చ జరుగుతోంది. కళాశాలల తనిఖీల పేరుతో వర్సిటీ ఉన్నతాధికారులకు నచ్చిన అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసుకుని వాటాలు పంచుకుంటున్నారని తెలుస్తోంది. పరీక్షల విభాగంలో విద్యార్థుల నుంచి సర్టిఫికెట్ల నుంచి మొదలుకుని ఇతర పనులన్నింటికీ డబ్బులు వసూలు చేస్తారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అందుబాటులో ఉండి సేవ చేస్తా..

నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తా.. : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి, జనవరి 5: మంత్రి పదవి హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు తనకు ఇచ్చిన గౌరవమని, అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సేవ చేసుకుంటానని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండల కేంద్రానికి మంత్రి పొన్నం మొదటి సారి రాగా, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో మండల కేంద్రానికి చేరుకున్నారు. బస్టాండ్ కూడలి వద్ద మంత్రికి పూలమాలలు వేసి బాణాసంచా పేల్చుతూ స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులను కలుస్తూ ఆప్యాయంగా పలకరించారు. మంత్రితో సెల్ఫీ తీసుకుంటూ ప్రజలు సందడి చేశారు. అనంతరం ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో గ్రామాల వారీగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటి పరిష్కారానికి గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఏ


మంత్రికి పూలమాల వేస్తున్న నాయకులు


ఎల్కతుర్తిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

విధంగా పర్యటించానో ఆదే విధంగా వచ్చి దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. హుస్నాబాద్ నియోజకపరిధిలో ఉన్న ప్రాజెక్టుల ద్వారా ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించే విధంగా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. గౌరవెల్లి, వరద కాలువ ఫేస్ - 2, శ్రీరాం సాగర్, దేవాదుల కాలువల ద్వారా ఎంత వీలైతే అంత ఎక్కువగా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అనారోగ్యం బారిన పడిన వ్యక్తులకు ఆస్పత్రుల్లో నాణ్యమైన చికిత్స అందించడానికి నియోజక వర్గంలో ప్రత్యేక వ్యక్తిని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. రోడ్లు, కుల సంఘాలు, తాగునీటి సమస్యలు, బస్సుల కొరత వంటి సమస్యల తీవ్రతను బట్టి పరిష్కారానికి ముందుకు తీసుకెళ్లుతానని హామీ ఇచ్చారు. భారీ మోజారిటీతో గెలిపించి తనకు రాష్ట్ర కేబినెట్‌లో స్థానం కలుగడానికి కృషి చేసిన ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యులు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు చల్లా మల్లారెడ్డి, రవిందర్‌రెడ్డి, రాము, నాయకులు గొలి రాజేశ్వర్ రావు, సంతాజీ, రమేష్, అక్తర్, మహేందర్, శ్రీకాంత్, రాజు, నవీన్, సంపత్, గంగాధర్, శ్రీధర్, వెంకటేష్, స్వరూప, సుష్మ, తోకల శ్రీనివాస్, పున్నం పాల్గన్నారు.

వినతుల వెల్లువ

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలపై గ్రామస్థులు, కార్యకర్తలు వినతి పత్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు. గ్రామాల్లో రోడ్లు, కమ్యూనిటీ భవనాలు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని నాయకులు వాపోయారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటుచేసుకున్న నివాసాలకు విద్యుత్, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు విన్నవించుకున్నారు. మోడల్ పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు.

దైవ దర్శనానికి వెళ్తూ వ్యక్తి మృతి


అంజయ్య (ఫైల్)

గార్ల, జనవరి 5 : మండలంలోని కొత్త పోచారానికి చెందిన మలీదు అంజయ్య (50) గుండె పోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. రెండురోజుల క్రితం భద్రాచలం దైవదర్శనానికి కాలినడకన పోచారం నుంచి బయలు దేరాడు. పాల్వంచ సమీపంలోని పెద్దమ్మగుడి వద్ద చేరుకొగానే గురువారం రాత్రి కావడంతో అక్కడే పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున దేరిన అంజయ్య మార్గమధ్యలో గుండెపోటు రావడంతో రోడ్డుపైనే మృత్యువాత పడ్డాడు. అంజయ్య ఇద్దరు కుమారులు అయ్యప్ప మాలధారణ చేసి, శబరిమలై యాత్రకు పోయారు. కుమారులు వచ్చే వరకు భద్రాచలంలో మొక్కులు తీర్చుకుందామని భద్రాచలం పుణ్యక్షేత్రానికి బయలు దేరిన అం జయ్య శవమై ఇంటికి రావడంతో గ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా, గుండెపోటుతో మృతి చెందినట్లు పాల్వంచ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

గార్ల, జనవరి 5 : ముల్కనూరు గ్రామపంచాయతీ గుంపెళ్లగూడెంకు చెందిన కల్లెం రాజు (26) ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వేజీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం. గార్ల రైల్వేస్టేషన్ సమీపంలోని పది మోరీల వద్ద ఉదయం10.30 గంటల సమయంలో ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ కింద గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. డోర్నకల్ డిప్యూటీస్టేషన్ సూపరిండెంట్ పంకజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

బయ్యారం, జనవరి 5 : అప్పుల బాధతో పురుగుల మందుతాగి, ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. సంతులాల్‌పోడు తండాకు చెందిన బానోత్ చిన్నా కుమారుడు అంజీ (24) గత ఏడాదిగా హైదరాబాద్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే అంజీ తన స్నేహితుల వద్ద అప్పులు చేసేవాడు. వాటిని అప్పులు తీర్చలేక మద్యానికి బానిసైన అంజీ మనస్థాపంతో గతనెల 14వ తేదీన క్రిమిసంహారక (గడ్డిమందు) మందుసేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అయితే హైదరాబాద్‌లో వైద్యం చేయించలేని పరిస్థితిల్లో ఇటీవల అంజీని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో శుక్రవారం తెల్లవారు జామున అంజీ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

డోర్నకల్‌లో ట్రాక్టర్ చోరీ

డోర్నకల్, జనవరి 5 : మునిసిపల్ కేంద్రంలోని శ్రీవీర హనుమాన్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద నిలిపి ఉంచిన మహింద్ర ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించుకుపోయినట్లు యాజమాని దాసరి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్‌లోని పనులు ముగించుకుని గురువారం సాయం త్రం శ్రీవీరహనుమాన్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద తన ట్రాక్టర్ టీఎస్26-టీ 5757 ఇంజన్, టీఎస్26-టీ 5362 నెంబర్ గల ట్రాక్టర్ ట్రాలీని పార్కింగ్ చేసినట్లు చెప్పారు. తర్వాత ఇంటికి వెళ్లి మరుసటిరోజు వచ్చి చూసేసరికి ట్రాక్టర్, ట్రాలీ లేకపోవడంతో పరిసర ప్రాంతాలు, బంధువులను, స్నేహితుల వద్ద ఆరా తీశారు. ఎక్కడ అచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పారు.

ఠాణాలను పరిశీలించిన సీఆర్‌పీఎఫ్ ఐజీ


కొత్తగూడలో సీఆర్‌పీఎఫ్ ఐజీకి మొక్కను అందిస్తున్న ఎస్పీ సంగ్రామ్ పాటిల్

కొత్తగూడ, జనవరి 5 : కొత్తగూడ, గంగారం పోలీస్‌స్టేషన్లు, సీఆర్‌పీఎఫ్ బెటాయిన్ ఔట్‌పోస్టులను శుక్రవారం సీఆర్‌పీఎఫ్ ఐజీ చారుసిన్హా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను, బెటాలియన్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. తనిఖీలను ముమ్మరం చేయాలని సిబ్బంది ఆదేశించారు. జిల్లా ఎస్పీ సంగ్రామ్‌పాటిల్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఫణిధర్, ఎస్ఐలు నగేష్, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

దంతాలపల్లి, జనవరి 5 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉమామల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండల సంబంధిత అధికారులు, ఇతర సిబ్బంది సకాలంలో హాజరు కావాలన్నారు.

మేచరాజుపల్లి బీటీ రోడ్డుకు కృషి చేస్తా

నెల్లికుదురు, జనవరి 5 : కాచికల్‌నుంచి మేచరాజుపల్లికి బీటీరోడ్డు ఏర్పాటుకు కృషి చేయనున్నట్లుఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. మేచరాజుపల్లి, కాచికల్, శ్రీరామగిరిలో శక్రవారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్‌లు లక్ష్మీ, శ్రీను, జ్యోతి, ఎంపీపీ మాధవి, వైస్‌ఎంపీపీ వెంకటేష్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి రామారావు, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో శేషాద్రి, అధికారులు పాల్గొన్నారు.


ఇనుగుర్తిలో టీపీటీఎఫ్ క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న మండల నాయకులు


కేసముద్రంలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు


చిట్యాలలో నూతన క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

టీపీటీఎఫ్ క్యాలెండర్‌ల ఆవిష్కరణ

కేసముద్రం, జనవరి 5 : కేసముద్రం ఎంఆర్‌సీ ఆవరణలో శుక్రవారం తెలంగాణ ప్రొగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌లను సంఘం మండల అధ్యక్షుడు చీకటి వెంకట్రామనర్సయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న తొర్రూరులో జరిగే విద్యాసదస్సుకు రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ హాజరవుతున్నారని, ఈ సదస్సుకు ఉపాధ్యాయులుతరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల బాధ్యులు ఎన్.నర్సింహరాజు, జి.సురేందర్, వి.నర్సయ్య, జి.మోహనకృష్ణ, యు.ప్రణయ్‌కుమార్, జి.యాదగిరి, ఎస్కే.మునీర్ అహ్మద్, జి.గోవర్ధన్, జి.జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆ సంఘం మండల అధ్యక్షుడు గుండు సురేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 7న తొర్రూరులో జరిగే డివిజన్‌స్థాయి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి సత్వరమే పరిష్కరించాలన్నారు. రూపారాణి, కదిరె ప్రభాకర్, కొమ్ము రాజేందర్, కోటేశ్వర్, సారంగపాణి, శ్రీశైలం, సతీష్, దేవేందర్, కుమారస్వామి, పాల్గొన్నారు.

● పెద్దవంగర : తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో ఈనెల 7న ఏర్పాటు చేసిన విద్యా సదస్సును జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్యాల సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు సోమరపు ఐలయ్య కోరారు. చిట్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యాసదస్సు కరపత్రాలను, టీపీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సదస్సులో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పాల్గొని రాజ్యాంగ విలువలు-భారత రాజకీయాలు, భారత రాజ్యాగం, సమాజ అవసరాలు-పాలకుల విధానాలు అనే అంశాలపై ప్రసంగించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి టీపీటీఎఫ్ యూనియన్ తగు సూచనలు అందిస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, సురేష్, ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులు, అరుణ, మురళి, వెంకటేశ్వర్లు, యుగేందర్, సీఆర్పీలు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 5 : జిల్లా కేంద్రంలోని 36వ వార్డు అడ్వకేట్ కాలనీలోని శ్రీరామభక్తులు శుక్రవారం అయోధ్య శ్రీరామ అక్షింతలు పంపిణీ చేశారు. స్థానిక అడ్వకేట్ కాలనీలో అయోధ్య నుంచి వచ్చిన పవిత్రమైన శ్రీరాముల వారి అక్షింతలు సంప్రదాయ దుస్తులచే రామనామస్మరణతో ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాదు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రామకార్యము 50 సంవత్సరముల నిరీక్షణకు అయోధ్యలో శ్రీరామాలయ నిర్మాణం జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత, లక్ష్మీనరసింహ రావు, శోభారాణి, రవికుమార్, కొండ్లె అనిల్‌కుమార్, రమేష్, రాధిక, మురళీ, సుధాకర్, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని 19వ వార్డులో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను నిర్వాహకులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. జనవరి 22న అయోధ్యలో రాముడి విగ్రహం ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతి ఇంటికి అక్షింతలను అందజేస్తున్నట్లు బీజేపీ జిల్లా కోశాధికారి క్యాచువల్ శ్యాసుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నం మాల్పాని, ప్రేమ్‌చంద్‌వ్యాస్, జుగల్‌మాల్పాని, జయప్రకాష్ లోయా, గోపాల్‌గెలడా, శ్రీరంగం మురళి, పద్మ, కలంత్రి, అరుణరుువార్, సునీత తదితరులు పాల్గొన్నారు.

● కేసముద్రం : కేసముద్రం స్టేషన్‌లో శుక్రవారం అయోధ్య రామజన్మభూమి నుంచి వచ్చిన అంక్షింతలు, కలశాలతో రామభక్త బృందం ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి మార్కెట్ వరకు ఈ యాత్ర కొనసాగింది. వేలం శ్రీనివాస్ (రోహిణి), బానాల నాగరాజు, బోనగిరి ఉపేందర్, తవిడిశెట్టి రవి, కొత్తకొండ యాదగిరి, బాదావత్ శ్రీను, లెంకలపల్లి సంతోష్, బ్రాహ్మణపల్లి రవి, రామగిరి భాగ్యమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

గూడూరు : బొల్లెపల్లిలో అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆపై ఇంటింటికి అందజేశారు. కార్యక్రమంలో బుర్ర వేణు, చీర కుమారస్వామి, యాకయ్య, కోరె కుమార్, అన్న వెంకన్న పాల్గొన్నారు.

'విద్యార్థులు సాంకేతికతను వినియోగించుకోవాలి'

తొర్రూరు, జనవరి 5 : నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు సాంకేతికతను వినియోగించుకుని ముందుకు వెళ్లాలని లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ హనుమాండ్ల దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో భాగంగా మూడు రోజులపాటు విద్యార్థులు నూతనంగా కనుగొన్న ప్రయోగాలు, ఆవిష్కరణలు ప్రదర్శింపబడతాయన్నారు. సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు రూపొందించిన ఆటోమెటిక్ స్ట్రీట్ లైట్, డస్ట్‌బిన్, అలారం, అందులకు ఉపయోగపడే అద్దాలు, ట్రాఫిక్‌లో అంబులెన్సును మర్లించే యంత్రం తదితర ఆవిష్కరణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెంటర్ పూజిత, ఉపాధ్యాయులు భాస్కర్, నాగేశ్వర్, ఓంప్రకాశ్, వెంకటేష్, శ్రీనివాస్, మురళీకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యాసదస్సును జయప్రదం చేయండి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 5 : తొర్రూరులో ఈనెల 7న తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యాసదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. మహబూబాబాద్‌లోని సంఘం భవనంలో శుక్రవారం మండల అధ్యక్షుడు రాచకొండ ఉపేందర్ నేతృత్వంలో విద్యాసదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ సమకాలిన రాజకీయ, ఆర్థిక సామాజిక, విద్యారంగ పరిస్థితులను చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి ముఖ్యవక్తలుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు సంఘాలకు అతీతంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యార్థులు, రాజకీయ, కుల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలాష్టి రమేష్, చీకటి ఉపేందర్, సజ్జనము విద్యాసాగర్, గోవర్ధన్, శ్రీనివాస్, మురళీ, సుధాకర్, శంకర్, కార్తీక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఏలు

తొర్రూరు, జనవరి 5 : మహబూబాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అద్వైత్‌కుమార్ సింగ్‌ను పూర్వపు వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ జేఏసీ చైర్మన్ బెజ్జం భరత్‌కుమార్ మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్‌ఏలకు వేతనాలు, ఎంప్లాయిస్ ఐడీలపై సర్క్యులర్ జారీ చేసిందని, గత 5నెలలుగా జీతాల కోసం చూస్తున్న తమకు ఎంతో ఊరట కలిగిందన్నారు. జిల్లాలో ఉన్న 426 మంది వీఆర్‌ఏల వేతన వెతలు తీరతాయని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ డి. శ్రీనివాస్, సభ్యులు తదితరులు ఉన్నారు.

● మరిపెడ : కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మరిపెడ మునిసిపల్ కమిషనర్ ఎ.రాజు కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మరిపెడ మునిసిపల్ అభివృద్ధిపై కలెక్టర్‌తో కమిషనర్ చర్చించారు.

విద్యా సదస్సును సక్సెస్ చేయాలి

నర్సింహులపేట, జనవరి 5 : తొర్రూరు పట్టణంలోని ఎల్‌వైఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే తొర్రూరు జోన్ విద్యాసదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నర్సింహులపేటలో విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు క్రాంతికుమార్, వెంకట్రాంనర్సయ్య భిక్షం, యాకన్న, శేఖర్, రమేష్, సంధ్య రాజు, బాలాజీ ఉన్నారు.

టెన్త్ స్టడీమెటీరియల్ పంపిణీ

నర్సింహులపేట, జనవరి 5 : పెద్దనాగారం హైసూల్‌లో పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలో ఉత్తమ గ్రేడ్ సాధించాలని హెచ్‌ఎం జానకీ సుమన రూ.6 వేలు విలువ చేసే అల్‌ఇన్‌వన్ స్టడీమెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు సమయ పాలన పాటించి ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సంసిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


నరేష్ (ఫైల్)

నర్సింహులపేట, జనవరి 5 : పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా హాస్పిటల్‌లో శుక్రవారం జరిగింది. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి శివారు రూప్లాతండాకు చెందిన తేజావత్ నరేష్ (22)తో రామన్నగూడెం గోల్‌బోడ్కాతండా పంచాయతీ పరిధిలోని చర్లచంద్రుతండాకు చెందిన పార్వతితో సంవత్సరం క్రితం వివాహమైంది. ప్రస్తుతం నిండు గర్భిణీ. ఈనెల 4న భార్య పార్వతి ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లేందుకు ప్రయాణం కావడంతో తిరస్కరించాడు. కుటుంబపెద్దలు మొదటి కాన్పు పుట్టింటివద్దనే కావాలని భార్య పార్వతిని తల్లిగారింటికి పంపించారు. దీంతో మనస్థాపం చెందిన నరేష్ ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు గమనించి జిల్లా ప్రధాన హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి నరేష్ మృతి చెందాడు. మృతుడి తల్లి మాన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విధుల్లో చేరిన జూనియర్ జీపీ కార్యదర్శులు

● మరొకరిని విధుల నుంచి తొలగించిన కలెక్టర్

దంతాలపల్లి, జనవరి 5 : గతంలో జరిగిన ఆసరా పింఛన్ల పంపిణీ అభియోగంపై సస్పెండైన ఇద్దరు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తిరిగి శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి అప్సర పాష మాట్లాడుతూ 2023 జూన్ 5న గున్నేపల్లిలో మృతుల పింఛన్ల స్వాహా అభియోగంపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, వెంకన్న సస్పెండయ్యారన్నారు. తిరిగి విచారణ అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి విధుల్లో చేరారన్నారు. గున్నేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్షర సెలవుపై ఉండడంతో వాల్యాతండా జూనియర్ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, లక్ష్మీపురం కార్యదర్శి వెంకన్న కొద్ది కాలం ఇన్‌చార్జి బాధ్యతలను తీసుకున్నారన్నారు. గున్నేపల్లి పర్మినెంట్ కార్యదర్శి అక్షర పింఛన్లను స్వాహా చేశారనే ఆరోపణలపై ఆమెను విధుల నుంచి తొలగిస్తూ, ఇన్‌చార్జులుగా వ్యవహరించిన శ్రీకాంత్, వెంకన్నపై పూర్తిస్థాయిలో విచారణ అనంతరం కలెక్టర్ విధుల్లోకి అనుమతించారన్నారు. దీంతో తిరిగివారిని పాత గ్రామపంచాయతీలకే విధులు నిర్వర్తించేలా ఆదేశాలు జారీ అయ్యాయన్నారు.

బీఎస్పీతోనే దేశ రాజకీయాల మలుపు

● బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి తేజావత్ అభినాయక్

మరిపెడ, జనవరి 5 : బీఎస్పీతోనే దేశ రాజకీయాలు మలుపుతిరుగుతాయని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి తేజావత్ అభినాయక్ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన వరంగల్‌లో నిర్వహిస్తుండగా.. మరిపెడ మండలం నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అభినాయక్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే రానున్న పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలలో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డోర్నకల్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఐనాల పరుశరాములు, జినక సుమార్ధ, కృష్ణమూర్తి, ప్రమీల, మహేశ్, మహేశ్వరి, మల్లెపాక అనిల్, స్వరూప, హలవత్ రంజిత్, లక్ష్మీనారాయణ, వినోద్, ప్రశాంత్, కర్ణప్రకాశ్ తదితరులు వరంగల్‌కు తరలి వెళ్లారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

దంతాలపల్లి, జనవరి 5 : క్రీడలతోనే విద్యార్థులకు మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందని ప్రముఖ కాంట్రాక్టర్ నూకల శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వేములపల్లిలో వేములపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10,016, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ రూ.1,016, బెస్ట్ క్యాచ్‌కు రూ.1,016, సిక్స్ ఆఫ్‌ది మ్యాచర్‌కు రూ.1,016ను అందిస్తామ న్నారు. శ్రావణ్ కుమార్‌రెడ్డిని మాజీ సర్పంచ్ గుమ్మడవెల్లి పర్శయ్య, సీఏ పర్శయ్యతో పాటు గ్రామస్థులు, క్రికెట్ క్రీడాకారులు అభినందించారు.

'సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

మరిపెడ రూరల్, జనవరి 5 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సైదులు అన్నారు. శుక్రవారం తాళ్లపూకల్, ఆనేపురంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. దరఖాస్తు ఫారాలను రేపటిలోగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సెంటర్లలో ఇవ్వాలని తహసీల్దార్ కోరారు. ఎంపీవో పూర్ణచందర్‌రెడ్డి, తాళ్లపూకల్, ఆనేపురం సర్పంచ్ల్ బొలగాని మన్మథ, దామెర వీరన్న, ఎంపీటీసీ కొంపెల్లి సత్యనారాయణరెడ్డి, పూకల్ ఉపేందర్, సీమ సురేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుప్పట్లు, దోమ తెరల పంపిణీ

గూడూరు, జనవరి 5 : మండలంలోని మట్టేవాడ శివారు దొరవారితిమ్మాపురం, ఊట్ల, మచ్చర్ల, కొంగరిగిద్దలో ఆదివాసీ గిరిజన వృద్ధులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా చైర్మన్ పి.వరప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనగూడాల్లో ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారికి రక్షణగా ఉండేందుకు 40 ఉన్ని దుప్పట్లను, దోమకాటుకు గురికాకుండా ఉండేందుకు 75 దోమతెరలు అందించినట్లు పేర్కొన్నారు. వైస్ చైర్మన్ డాక్టర్ బి.నెహ్రూ, గొర్రె వెంకన్న, గూడూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ వీరన్న, ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, సర్పంచ్ ఈసం సంధ్యసూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఈజీఎస్ ఉద్యోగులు

గూడూరు, జనవరి 5 : మండలంలోని కొల్లాపురంలో శుక్రవారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను ఈజీఎస్ ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందినసందర్భంగా ఈజీఎస్ ఉద్యోగులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆపై వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోజారాణి, ఏపీఎం భస్సీలాల్, టీఏలు రాజేంద్రప్రసాద్, యుగేందర్, రాము, శివకృష్ణ, ప్రవీన్, అశోక్, ప్రియాంక పాల్గొన్నారు.

దళితబంధు నిధులను విడుదల చేయాలి

● పానుగంటి విష్ణువర్ధన్ డిమాండ్

కేసముద్రం, జనవరి 5 : నిరుపేద దళితులను ఆర్థికంగా అభివృద్ధి పర్చేందుకు అమలు చేస్తున్న దళితబంధు పథకానికి నిధులను వెంటనే విడుదల చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు లబ్ధిదారులను ఎంపిక చేసి ఎన్నికల కోడ్ రావడంతో నిధుల విడుదలను నిలిపివేశారని తెలిపారు. ఆయన వెంట మిట్టగడుపుల మహేందర్, అలిసేరి శ్రీనివాస్, దేవరకొండ విద్యాసాగర్, జెల్లంపల్లి సుధాకర్, శ్రీకాంత్, ప్రవీణ్, లింగాడపు సురేష్, గుండె యాకయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

మహబూబాబాద్ టౌన్, జనవరి 5: మిర్చి రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథంభవన్‌లో శుక్రవారం గునిగంటి రాజన్న అధ్యక్షతన తెలంగాణ రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మిర్చి విస్తీర్ణం పెరిగిందని, బొబ్బ, నల్లిపురుగు తెగుళ్లతో దిగుబడులు తగ్గి లక్షల్లో పెట్టుబడులు పెట్టిన రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న, ఆఫీస్ బేరర్స్ మార్తినేని పాపారావు, బొబ్బ వెంకట్‌రెడ్డి, నల్లపు సుధాకర్, కందాల రమేష్, మండల నాగమ్మ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద, కొమురంభీం విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలి

● మా అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేంద్రం

మహబూబాబాద్ టౌన్, జనవరి 5 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహనీయులు స్వామివివేకానంద, కొమురంభీం విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలని మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు విస్తరణలో భాగంగా వివేకానంద, కొమురంభీం విగ్రహాలను తొలగించి ఏటిగడ్డ తండా వాటర్ ట్యాంక్ వద్ద నక్కన పెట్టారని చెప్పారు. బస్టాండ్ సెంటర్లలో మహనీయులు వివేకానంద, కొమురంభీంల కాంస్య విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలని కోరారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలన్నారు.

సీరోలు మండల యాదవ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

సీరోలు, జనవరి 5 : మండల యాదవ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ తెలిపారు. సీరోలు మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో మండల అధ్యక్షుడిగా పెరుగు రాజు, ఉపాధ్యక్షుడిగా బడుగుల బిందుయాదవ్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు మాట్లాడుతూ... యాదవులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బాబురావు, పోతుల దిలీప్, కేసాని మధు, వంగ వినోద్, బిట్టు, సున్న కుమార్, గణేష్, నవీన్, శ్రీకాంత్, మల్లు వినయ్, విక్రమ్, రాకేష్, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఉన్మాదం

● కన్నతల్లిని రోకలితో కొట్టి చంపిన కొడుకు


ఉన్మాది రాజిరెడ్డిని తాళ్లతో బంధించిన దృశ్యం
హైమ (ఫైల్)

రేగొండ, జనవరి 5 : మతిస్థిమితం తప్పిందో... ఉన్మాదమో తెలియదు గానీ అతడు.. తన కన్న తల్లినే దారుణంగా హత్య చేశాడు. అడ్డు వచ్చిన మరో మహిళపైనా దాడికి దిగాడు. తీవ్ర గాయాలతో ఆమె మృత్యువుతో పోరాడుతోంది.ఈ దారుణ ఘటన జయశంకర్ భూపాల పల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఉన్మాది తీరుతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. తల్లిని చంపిన అనంతరం ఉన్మాది అక్కడి నుంచి పరారై మరో గ్రామంలో తిరుగుతుండగా గ్రామస్థు లు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని కొడుకే కడతేర్చడం ప్రతీ ఒక్కరిని నివ్వెరపరిచింది.

కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం. రేగొండ మండలం తిరుమలగిరికి చెందిన కంచర్లకుంట్ల మోహన్‌రెడ్డి-హైమ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి (42) భార్య సరితతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని ఇద్దరు కుమారులు హనుమకొండలో ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు.

అయితే రాజిరెడ్డి కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతూ అప్పుడప్పుడు భార్యతో గొడవ పడేవాడు. ఐదేళ్లుగా ఎలాంటి సమస్య లేకుండా ఉన్న రాజిరెడ్డి... గత పదిరోజులుగా నిద్రపోకుండా గొడవ చేస్తూ తనకు శక్తి ఆవహించిందని చెప్పడం మొదలు పెట్టాడు. దీంతో అతనికి భార్య సరిత, తల్లి హైమ తాయత్తు కట్టించారు.

ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి రాజిరెడ్డి మళ్లీ గొడవకు దిగాడు. తెల్లవారాక ఆస్పత్రికి వెళ్దామని పడుకోమని చెప్పగా 'నన్ను ఏంచేస్తున్నారు.. చంపుతారా..' అంటూ తల్లి, భార్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. దీంతో తల్లిహైమ, భార్య సరిత భయంతో ఎదురుగా ఉన్న తమ ఇంట్లోకి వెళ్లి పడుకున్నారు. అయితే రాజిరెడ్డి ఊరుకోకుండా బయటికి రాకపోతే ఇంట్లో ఉన్నపత్తి కాలబెడుతా అంటూ హెచ్చరించడంతో తల్లి బయటకు వచ్చింది. ఈ సమయంలో రాజిరెడ్డి పక్కనే ఉన్న రోకలి తీయడంతో తల్లి, భార్య చెరోవైపు పరిగెత్తారు. తొలుత తల్లి హైమ(60) తలపై విచక్షణ రహితంగా దాడిచేయగా, ఆమె తలభాగం మొత్తం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది.

ఇదే సమయంలో పక్కింట్లో ఉన్న ఊకంటి జ్యోతి బయటకు వచ్చి అడ్డుకోబోగా ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలతో కింద పడిపోయింది. నిందితుడి భార్య పారిపోయి చుట్టుపక్కల వారిని తీసుకువచ్చేలోగా 'ఇద్దరిని చంపేసిన.. ఎవరు వస్తారో రండి.. అందరిని చంపుతా..' అని రాజిరెడ్డి ముందుకు రావడంతో అందరూ భయంతో ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. అనంతరం నిందితుడు రోకలితో పారిపోయాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ వేణుచందర్, ఐదుగురు ఎస్సైలు, పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. గాయపడిన జ్యోతిని అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం వరకు నిందితుడి కోసం గాలించారు.

కాగా, గోరికొత్తపల్లి మండలంలోని చిన్నకోడెపాకలో రాజిరెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామస్థులు పట్టుకుని కట్టేసి పోలీసులకు సమాచారం అందిచారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ రాములు తిరుమలగిరిలోని సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రత్యక్ష సాక్షులు, కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాపాడబోయి ప్రాణాల మీదకు..

పక్క ఇంట్లో గొడవ జరుగుతందని తెలిసి నిద్రలేచి బయటకు వచ్చి కాపాడబోయిన జ్యోతి(బంధువు) ప్రాణాలకే ప్రమాదం ఏర్పడింది. రాజిరెడ్డి దాడిలో గాయపడ్డ జ్యోతి కోమాలోకి పోగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.